పేరు మార్చి.. తల్లులను ఏమార్చి!

- ఇలాగేనా తల్లికి వందనం ఇచ్చేది?
- ఎన్నికల్లో చెప్పిందొకటి.. చేసిందొకటంటూ తల్లుల గగ్గోలు



ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామంటూ కూటమి మేనిఫెస్టోలో రెండవ అంశంగా పేర్కొన్న దృశ్యం

తెనాలి: గత వైఎస్సార్ సీపీ అమలు చేసిన 'అమ్మఒడి' పథకాన్ని కూటమి ప్రభుత్వం పేరు మార్చింది. 'తల్లికి వందనం' పేరుతో ఒక తల్లికి ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15 వేల చొప్పున ఇస్తామని ఎన్నికల ముందు చేసిన ప్రకటనను మహిళలు విశ్వసించారు. వారి ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వం ఆ హామీని విస్మరించింది. ఒక తల్లికి రూ.15 వేలు అందజేస్తామంటూ జీవోను ఇవ్వటంపై మహిళలు నిరాశకు లోనయ్యారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని విస్మరించి ఏమార్చటంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

జగనన్న ప్రభుత్వ హయాంలో 'బతుకులు మార్చే గుడి– జగనన్న అమ్మఒడి' అనే కార్యక్రమం ద్వారా ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న పిల్లలున్న ప్రతి తల్లికి రూ.15 వేల చొప్పున ఏటా ఆర్థికసాయం చేసిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద నాలుగు విడతలుగా ప్రభుత్వం రూ.15 వేల ఆర్థికసాయాన్ని అందజేసింది. ఇందులో ఒక వెయ్యి పాఠశాల అభివృద్ధి నిధి కింద రూ.1,000, శానిటేషన్ మెయింటెనెన్స్‌కు మరో రూ.1,000 తగ్గించి, రూ.13 వేలను నేరుగా తల్లి ఖాతాల్లో చేసింది.

తెనాలి నియోజకవర్గంలో తొలి విడత 25,850 మందికి రూ.38.77 కోట్లు, రెండో విడత 25,471 మందికి రూ.38.20 కోట్లు, మూడో విడత 21,213 మందికి రూ.31.81 కోట్లు, నాలుగో విడత 20,857 మందికి రూ.31.28 కోట్ల వంతున మొత్తం రూ.140 కోట్లను తల్లుల ఖాతాల్లో జమచేసింది. నాలుగో విడతలో పట్టణ మున్సిపాలిటీ పరిధిలో 11,074 మందికి రూ.16.61 కోట్లు, రూరల్ మండలంలో రూ.5,833 మందికి రూ.8.74 కోట్లు, కొల్లిపర మండలంలో 3,950 మందికి రూ.5.92 కోట్లు లబ్ధిని పొందారు.

ఎన్నికల వేళలో ఒక తల్లికి ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున తల్లికి వందనం పేరుతో ఇస్తామని కూటమి నేతలు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ ఎన్నికల సభల్లో హామీనిచ్చారు. ఆయా పార్టీల నేతలు ప్రతి ఇంటికి కరపత్రాలను పంచారు. తల్లులకు నమ్మబలికారు. తీరా ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం గెలిచి అధికారంలోకి చేపట్టింది. పాఠశాలలు పునఃప్రారంభించి నెలరోజులవుతున్నా ఇప్పటికీ తల్లికి వందనం అమలు కోసం మహిళలు ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఒక తల్లికి రూ.15 వేల ఆర్థికసాయానికి జీవో జారీచేసిందని తెలిసి హతశులయ్యారు.

నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలలు 150, ప్రైవేటు పాఠశాలలు 100 ఉండగా, ఇంటర్మీడియట్ బోధించే విద్యాసంస్థలు 17 ఉన్నాయి. వీటన్నింటిలో దాదాపు 42 వేల మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద కేవలం ఒక తల్లికి రూ.15 వేలు మాత్రమే ఆర్థిక సాయం చేస్తే, హామీని విస్మరించినట్టే అవుతుందని అంటున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతున్నారు.

ఇచ్చిన హామీని అమలు చేయాలి



నా పేరు కనపర్తి కల్యాణి, నేను ప్రవేట్ ఉద్యోగిని. నా భర్త శశికుమార్ తాపీ మేస్త్రి. మాకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్దపాప ఇంటర్ ప్రథమ సంవత్సరం, చిన్నపాప కఠెవరంలోని జిల్లా పరిషత్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతుంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమ్మఒడి పథకాన్ని ప్రవేశపెట్టి పిల్లల చదువులను ప్రోత్సహించింది. నేడు అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కూడా తల్లికి వందనం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టనుండటం సంతోషకరం. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఇద్దరు పిల్లలకు తల్లికి వందనంకు అర్హులుగా ప్రకటించి ఆర్థిక చేయూతనివ్వాలి.

– కనపర్తి కల్యాణి, కఠెవరం, తెనాలి.

పిల్లల చదువులకు అందించాలి



నా పేరు పానుబోతు ఆదిలక్ష్మి. నేను కూలీ పని చేస్తుంటాను. నా భర్త పేరు నాయక్. గతంలో వలంటీర్‌గా పనిచేశారు. మాకు ముగ్గురు ఆడపిల్లలు. పెద్దపాప 6వ తరగతి, రెండో పాప 4వ తరగతి, చిన్నపాప 1వ తరగతి చెంచుపేటలోని మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో చదువుతున్నారు. కూలీ పనిచేసుకునే మాలాంటి వారికి పిల్లలను చదివించుకునేందుకు ప్రభుత్వం పలు పథకాలు గతంలో ప్రవేశపెట్టింది. దీనివలన ఆర్థిక భరోసా లభించింది.ప్రస్తుత ప్రభుత్వం కూడా ముగ్గురు పిల్లలకు తల్లికి వందనం పథకం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పానుబోతు ఆదిలక్ష్మి, చెంచుపేట, తెనాలి

క్లుప్తంగా

వెంకట ప్రసాద్‌కు అభినందల వెల్లువ



తెనాలిఅర్బన్: మానవత సంస్థ చైర్మన్‌గా నియమితులైన కటకం వెంకట ప్రసాద్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దుగ్గిరాల యూనిట్ అధ్యక్షులు అందె బాలచంద్రమౌళి, తెనాలి నాయకులు గుద్దంటి రవికుమార్, దీపాల శ్రీనివాసరావు, మరి కొందరూ గురువారం ఆయనను కలసి శుభాకాంక్షలు తెలియజేసి సన్మానించారు. తెనాలిలో జరిగిన కార్యక్రమంలో తిరువీధుల దుర్గా, శివరామప్రసాద్, షేక్ బాషీద్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యాధికారిగా డాక్టర్ జీవనలత



తెనాలి: పట్టణానికి చెందిన ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ డి.జీవనలత బాపట్ల జిల్లా పరిధిలో ఉత్తమ వైద్యాధికారి / ఉత్తమ ట్యూబెక్టమీ సర్జన్ అవార్డును అందుకున్నారు. గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా బాపట్లలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆ జిల్లా డీఎంహెచ్ డి.విజయమ్మ చేతులమీదుగా అవార్డును, ప్రశంసాపత్రాన్ని స్వీకరించారు. ప్రస్తుతం డాక్టర్ డి.జీవనలత చెరుకుపల్లి మండల గ్రామం కనగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేస్తున్నారు. గతేడాది సెప్టెంబరు నెల నుంచి ఇప్పటి వరకు 286 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినందుకు ఈ గౌరవం దక్కినట్టు తెలియజేశారు.

పర్యావరణ పరిరక్షణకు సమాజాన్ని చైతన్య పర్చాలి



గుంటూరు ఎడ్యుకేషన్: పర్యావరణ పరిరక్షణ దిశగా విద్యార్థులు సమాజాన్ని చైతన్య పర్చాలని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య పేర్కొన్నారు. లక్ష్మీపురంలో శ్రీచైతన్య స్కూల్ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండియా మిషన్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ చాటుతూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ అంతరించిపోతున్న అడవుల రక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధి గ్రీన్ ఇండియా మిషన్ లక్ష్యమన్నారు. ర్యాలీలో ప్రిన్సిపల్ ఎం.వినీత, కో–ఆర్డినేటర్ మూర్తి, డీన్ హరిబాబు, ఏవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంటీఎంసీ కమిషనర్‌గా షేక్ అలీంబాషా



మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా షేక్ అలీంబాషాను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో రాష్ట్రంలో మున్సిపల్ కమిషనర్ల బదిలీలు కొనసాగుతున్నాయి. ప్రతిష్ఠాత్మక ఎంటీఎంసీకి సీఆర్‌డీఏ అధికారిని కమిషనర్‌గా నియమించడం విశేషం. మంగళగిరి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నారా లోకేష్ రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టగా, గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిన ఎంటీఎంసీపై ఇప్పుడు తనదైన ముద్ర వేసేందుకు అలీంబాషాను నియమించినట్లు చర్చ జరుగుతోంది. ఇక్కడ కమిషనర్‌గా ఉన్న వి. నిర్మల్ కుమార్‌ను బాపట్ల బదిలీ చేశారు. బాపట్ల డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న బి. శ్రీకాంత్‌ను ఎంటీఎంసీ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న బి.శివారెడ్డిని సీడీఎంఏలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

ఆస్తి కోసం మరిదిని కిడ్నాప్ చేసిన వదిన

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తిని సమీప బంధువులు కిడ్నా చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యతిరాజుల కాలనీకి చెందిన బిల్లా గోపీకి 30 గజాల స్థలం ఉంది. వదిన నాగమణి స్థలం విషయమై గోపితో గొడవ పడుతుండేది. ఈ నెల 9న నాగమణి తన సమీప బంధువులు రమేష్, దేవి, నాగయ్యను వెంట తీసుకొచ్చి గోపి చేతులు కట్టి ఆటోలో ఎక్కించుకుని తన ఇంటికి తీసుకెళ్లింది. రూ.100ల స్టాంపు పేపర్లపై సంతకాలు పెట్టించుకుని వదిలిపెట్టారు. ఈ క్రమంలో గోపి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోండి

తెనాలిఅర్బన్: ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా విద్యార్థులు ప్రయత్నించాలని కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపల్ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. 10, 12 తరగతల పరీక్ష ఫలితాలు అత్యాధిక మార్కులు సాధించిన విద్యార్థుల అభినందన సభను గురువారం జగ్గడిగుంటపాలెంలోని పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల ప్రథమస్థానంలో నిలిచిందని చెప్పారు. కేంద్రియ విద్యాలయ సంఘటన్ డిప్యూటీ కమిషనర్ తమ పాఠశాలకు ప్రశాంస పత్రాన్ని అందించినట్లు వివరించారు. అనంతరం సత్తెనపల్లిలో 8,9 తేదీల్లో జరిగిన అండర్ -14 విభాగ బాలుర ప్రాంతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన పాఠశాల జట్టును అభినందించారు. అలాగే నిర్వాహకులు అందజేసిన ట్రోఫీని జట్టు సభ్యులకు అందజేశారు. రానున్న రోజుల్లో జట్టు జాతీయ స్థాయిలో పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ బి.రవికుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకున్న వాలీబాల్ క్రీడాకారులు

ఘనంగా ఎంప్లాయీస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

తెనాలిఅర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం డిపో ఆవరణలో ఘనంగా నిర్వహించారు. సీనియర్ నాయకులు బి.సాంబశివరావు, యూనియన్ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంప్లాయీస్ యూనియన్ ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జోనల్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ పి.యలమందయ్య, జిల్లా కార్యదర్శి వి.విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ.రాజేష్ ఖన్నా, తెనాలి గౌరవ అధ్యక్షులు పి.వీరయ్యబాబు, నాయకులు ఆర్.ముక్తేశ్వరరావు, ఏవి.కృష్ణారెడ్డి, డిపో అధ్యక్ష కార్యదర్శులు కె.బాబు, ఎం.సుధాకర్ రరావు, పాల్గొన్నారు.



గర్భకోశ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు

తెనాలి: సంతోషకరమైన శుభకరమైన రోజును ఏదొక సేవతో గడపటం సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, తెనాలి శాఖ కార్యదర్శి, హ్యాపీ హాస్పటల్, తెనాలి నిర్వాహకురాలు డాక్టర్ పావనీ ప్రియాంక అన్నారు. వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఆర్.రవిచంద్రన్, చిత్రా రవిచంద్రన్ దంపతుల వివాహ వార్షికోత్సవం రోజైన గురువారం ప్రపంచవ్యాప్తంగా ఉచిత వైద్యశిబిరాలను నిర్వహించారు. అందులో భాగంగా వాసవీ క్లబ్ వనిత ఆంధ్రాప్యారిస్ తెనాలి ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లోని హ్యాపీ హాస్పటల్‌లో గర్భాశయ క్యాన్సర్ నిరోధంపై అవగాహన సదస్సు జరిపారు. డాక్టర్ పావనీ ప్రియాంక మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ లక్షణాలను, ప్రాథమికంగా గుర్తించటం, నివారణ వ్యాక్సిన్ వంటి అంశాలను వివరించారు. క్లబ్ ప్రెసిడెంట్ గంగిశెట్టి లీలారాణి, కార్యదర్శి గొల్లపూడి అనూరాధ, కోశాధికారి వక్కలగడ్డ విజయలక్ష్మి, ఐఈసీ ఆఫీసర్, ఇంటర్నేషనల్ వైస్‌ప్రెసిడెంట్ బొమ్మిశెట్టి లక్ష్మీకుమారి, కొత్తమాసు పద్మావతి, అమరా కళ్యాణి, సుగ్గుల లక్ష్మి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ పావనీ ప్రియాంకను సత్కరించారు.



డాక్టర్ పావనీ ప్రియాంకను సత్కరించిన క్లబ్ బాధ్యులు

అమరవీరుల త్యాగాలను స్మరించుకుందాం

కెప్టెన్ యర్రమనేని విజయప్రసాద్ 36వ వర్ధంతిలో ఉమామహేశ్వర్

తెనాలి: దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరసైనికుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయటం మనందరి బాధ్యతగా ఉపాధ్యాయ ప్రముఖుడు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత వేజళ్ల ఉమామహేశ్వర్ అన్నారు. పట్టణ చెంచుపేటకు చెందిన ఉపాధ్యాయ ఉద్యమనేత వైఎల్ నారాయణ–మీనాకుమారి దంపతుల కుమారుడు కెప్టెన్ యర్రమనేని విజయప్రసాద్ 36వ వర్ధంతిని గురువారం అదే ప్రాంతంలోని శబరి వృద్ధాలయంలో నిర్వహించారు. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ విజయప్రసాద్ జీవిత విశేషాలను తెలియజేశారు. తల్లిదండ్రులు తమ బిడ్డలను డాక్టర్, ఇంజినీరు చేయాలని చూస్తున్న రోజుల్లో వైఎల్ నారాయణ, మీనాకుమారి దంపతులు తమ కుమారుడు విజయప్రసాద్‌ను కోరుకొండ సైనిక్‌స్కూలుకు పంపినట్టు తెలిపారు. 12వ తరగతి వరకు అక్కడ చదివాక హిమాచల్‌ప్రదేశ్‌లోని మిలటరీ క్యాంపులో చేరి, అనతికాలంలో పారా కమాండర్ అయ్యారని చెప్పారు. 1987లో మన దేశం నుంచి శ్రీలంక వెళ్లిన 'శాంతి దళం'లో సభ్యుడిగా విజయప్రసాద్ తన సేవలను అందించినట్టు తెలిపారు. ఈ క్రమంలో 1988 జులై 11న తమిళ ఈలం టైగర్ ప్రభాకరన్ వర్గంతో జరిగిన పోరాటంలో విజయప్రసాద్ వీరమరణం పొందారని వివరించారు. అప్పటి నుంచి కుమారుడి వర్ధంతిరోజున తల్లిదండ్రులు సమాజసేవలో నిమగ్నమైనట్టు గుర్తుచేశారు. ఏటా వృద్ధులు, పాఠశాల విద్యార్థులకు ఆర్థిక చేయూతను అందిస్తున్నట్టు వివరించారు. తొంభై ఏళ్ల వయసులోనూ వైఎల్ నారాయణ ఈ సేవలను కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. తొలుత విజయప్రసాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జి.మురహరిరావు, ఆరి ఆనందరావు, భుజంగరావు, వేజళ్ల నవ్య తదితరులు పాల్గొన్నారు.



విజయప్రసాద్ చిత్రపటానికి పుష్పాంజలి

మొండి గేటు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

నెహ్రూ నగర్: సుదీర్ఘకాలం నుంచి పరిష్కారం కాకుండా ఉన్న మొండి గేటు వద్ద అవుట్ ఫాల్ డ్రెయిన్ రైల్వే క్రాసింగ్ పనులు వేగంగా చేపట్టడానికి జీఎంసీతో పాటు రైల్వే అధికారులు కూడా మరింత దృష్టి సారించాలని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో స్థానిక పాత గుంటూరు దగ్గరలోని మొండి గేటు రైల్వే ట్రాక్ వద్ద అవుట్ ఫాల్ డ్రెయిన్ క్రాసింగ్ అంశంపై జీఎంసీ ఇంజినీరింగ్, రైల్వే డివిజనల్ ఇంజినీర్లతో ఆయన సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. నగరం నుంచి నాలుగు మీటర్ల అవుట్ ఫాల్ డ్రెయిన్ నుంచి వచ్చే మురుగు, వర్షపు నీరు ట్రాక్ కింద 1.5 మీటర్ల వెడల్పు నుంచి బయటికి వెళ్లలేక.. పాత గుంటూరులోని పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయన్నారు. దీని వల్ల పలు కాలనీల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, రైల్వే ట్రాక్ మునిగి రైళ్ల రాకపోకలకు కూడా అంతరాయం కలుగుతుందని వివరించారు. నగరపాలక సంస్థతో పాటు రైల్వే అధికారులు కూడా సమస్య పరిష్కారానికి మరింత శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. రైల్వే నుంచి సమావేశానికి హాజరైన డివిజనల్ ఇంజినీర్ తమ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీవ్రతను వివరించాలన్నారు. నగరపాలక సంస్థ నుంచి కూడా రైల్వే అధికారులు తగిన వివరాలతో లేఖలు రాయాలని, కేంద్ర సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్ర శేఖర్ దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు. తదుపరి సమావేశం నాటికి సమస్య పరిష్కారానికి నిర్దిష్ట ప్రతిపాదనలు, టైం లైన్ కార్యాచరణ సిద్ధం అయ్యేలా రైల్వే, జీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జీఎంసీ ఎస్ఈ శ్యాంసుందర్, ఈఈ కోటేశ్వరరావు, రైల్వే డివిజనల్ ఇంజినీర్ సుదర్శనరెడ్డి, జీఎంసీ ఈఈఈ శ్రీధర్, ఏఈ సునీల్ కుమార్ పాల్గొన్నారు.



ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్

సమాజ సేవలోనూ ముందుండాలి

ఘనంగా బీ ఫార్మసీ విద్యార్థుల ఫేర్‌వెల్ డే

గుంటూరు ఎడ్యుకేషన్: బీ ఫార్మసీ పట్టభద్రులు ఔషధ రంగంతో పాటు జాతీయస్థాయిలో నిర్వహించే సివిల్స్ వంటి పోటీ పరీక్షల్లో సత్తా చాటి సమాజ సేవ చేయాలని హిందూ ఫార్మసీ కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో గురువారం బీ ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థుల ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రంగరాజు మాట్లాడుతూ ఫార్మసీ పట్టభద్రులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం పీజీఈ సెట్, జీ ప్యాట్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.సీతారామయ్య మాట్లాడుతూ బీ ఫార్మసీ విద్యార్థులు ఎం ఫార్మసీ చదవడం ద్వారా ఔషధ ఉత్పత్తి పరిశ్రమలతో పాటు బహుళ జాతి ఔషధ సంస్థల్లో ఉన్నతమైన ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, అధ్యాపకులు ఎన్.విజయలక్ష్మి, డాక్టర్ పి.జవహర్ బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు జి. సుబ్బారావు ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు, పర్యావరణ వేత్త డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమశిక్షణతో మెలిగి ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను శ్రద్ధగా విన్నప్పుడు విజయం సాధ్యమవుతుందని వివరించారు. సమయపాలన కచ్చితంగా పాటించాలని, ప్రణాళికతో ప్రతి సబ్జెక్ట్‌ను ఉపాధ్యాయుని ద్వారా రాబట్టుకుని చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పుస్తకాలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జె. జోజప్ప, పి. బుజ్జిబాబు, తదితరులు పాల్గొన్నారు.

నీట్ పునఃపరీక్ష.. విద్యార్థులకు శిక్ష

లక్ష్మీపురం: నీట్ ప్రశ్న పత్రం లీక్ విషయంలో తిరిగి పరీక్ష నిర్వహించడం 23 లక్షల మంది విద్యార్థులకు శిక్ష వేయటమేనని, ప్రభుత్వం ఉదార వైఖరిని ప్రదర్శించి విద్యార్థులను మానసిక క్షోభ నుంచి రక్షించాలని పేరెంట్స్ అసోసియేషన్ కన్వీనర్ వీఎస్ఎస్ మల్లేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాయలంలో బుధవారం ఏర్పాటు చేసిన చర్చా వేదిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నీట్ ప్రశ్న పత్రాలు లీక్ కావడంతో నష్ట పోయిన విద్యార్థులకు రీ–టెస్టికి చివరి అవకాశం ఇస్తామని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బెంచ్ వెల్లడించిందన్నారు. అయితే ఇది చివరి ఆప్షన్ మాత్రమేనని పేర్కొందన్నారు. రెండు మూడు కేంద్రాల్లో పేపర్ లీక్ అయినప్పుడు 23 లక్షల మందకి తిరిగి పరీక్ష పెట్టడం ఏ తప్పూ చేయని వారికి శిక్షేనని, దీనిపై పునరాలోచించాలని కోరారు. పి.భావన్నారాయణ్, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి సంస్థ సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు, సంస్థ సభ్యులు మాట్లాడారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ కన్వీనర్ మల్లేశ్వరరావు

కాన్పుల మధ్య కనీసం మూడేళ్లు ఎడం ఉండాలి



ఫిరంగిపురం: బిడ్డలు కనడానికి ఇద్దరి మధ్య కనీసం మూడేళ్ల సమయం ఉండేలా మహిళలు నియంత్రణ పాటించాలని డాక్టర్ శ్వేత అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. వేములూరిపాడులో నిర్వహించిన కార్యక్రమంలో ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ శ్వేత మాట్లాడుతూ ప్రతికుటుంబం ఆరోగ్యంగా, ఆర్థికంగా ఉండాలంటే నియంత్రణ పాటించాలని చెప్పారు. బిడ్డల మధ్య మూడేళ్లు ఎడం ఉండాలని సూచించారు. దానివల్ల మహిళలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏకే బాబు, సీహెచ్‌వో వెంకట రమణ, హెచ్‌వీ అన్నమేరి, ఎంఎల్‌హెచ్‌పీ స్వప్న, ఎంపీహెచ్‌ఏ బాబూరావు, ఏఎన్ఎం ఆంథోనిరాణి, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థలం విక్రయం పేరిట మోసం

తెనాలిరూరల్: స్థలం విక్రయిస్తానని ఒప్పందం చేసుకుని అడ్వాన్స్ తీసుకుని మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అంగలకుదురుకు చెందిన మాధవరావు తన స్థలం విక్రయిస్తానంటూ అదే గ్రామానికి చెందిన సుమలతతో ఒప్పందం చేసుకుని కొంత మొత్తం అడ్వాన్సు కింద తీసుకున్నాడు. రోజులు గడుస్తున్నా రిజిస్ట్రేషన్ ఊసే ఎత్తకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముప్పయ్ వేలిచ్చి.. రెండున్నర లక్షలు కాజేశారు!

ఆన్‌లైన్‌లో మోసపోయిన కఠెవరం మహిళ

తెనాలిరూరల్: ఆన్‌లైన్‌లో సినిమాలు, ఇతర ఉత్పత్తులు, హోటళ్లకు రేటింగ్ ఇస్తే నగదు ఇస్తామంటూ వచ్చిన టెలిగ్రామ్ యాప్‌లో వచ్చిన లింక్ క్లిక్ చేసి మహిళ సుమారు రూ. 2.53 లక్షలు మోసపోయింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండల గ్రామం కఠెవరంకు చెందిన తుమ్మల రేణుకకు టెలిగ్రామ్ యాప్‌లో గుర్తు తెలియని నంబరు నుంచి లింక్ వచ్చింది. అది క్లిక్ చేయగా ఆన్‌లైన్‌లో సినిమాలు, హోటళ్ల ఇతర ఉత్పత్తులకు రేటింగ్ ఇవ్వాలని ఇందుకు వేలల్లో నగదు పొందవచ్చని సమాచారం ఉంది. లింక్‌లో సూచించిన విధంగా రేటింగ్ ఇవ్వగా రూ. 30 వేలు రేణుక ఖాతాలో జమ అయ్యింది. దీంతో లింక్‌ను పంపిన వారిని నమ్మిన ఆమె తరచూ రేటింగ్ ఇస్తూ ఉంది. యాప్‌లో సూచించిన విధంగా మూడు దఫాల్లో రూ. 2.53 లక్షలు చెల్లించింది. అప్పటి నుంచి లింక్ పని చేయకుండా పోవడం, సదరు నంబరు నుంచి ఎటువంటి సమాచారం అందకపోవడంతో మోసపోయానని గ్రహించి పోలీసులను ఆశ్రయించింది. సైబర్ క్రైం కింద కేసును నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ పి. కోటేశ్వరరావు తెలిపారు.

అవగాహనతోనే అతిసార నివారణ

తెనాలిఅర్బన్: అవగాహనతో అతిసారా వ్యాధిని నియంత్రించవచ్చని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల పేర్కొన్నారు. అతిసారా వ్యాధిపై మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా హాల్‌లో గురువారం డ్వాక్రా మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలుషిత నీరు, ఆహార పదార్థాలు తీసుకోవడం వలన అతిసారా వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. వేడివేడి ఆహార పదార్థాలను తీసుకోవడంతో పాటు కాచి చలార్చిన నీటిని త్రాగాలన్నారు. ఎవరికైనా విరోచనాలు అయితే వెంటనే వైద్యశాలలకు వెళ్ళి చికిత్స పొందాలని సూచించారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు తెనాలి

SOP. No:113/2024

Between :

కొనికి ధనలక్ష్మి .. పిటీషనర్

ఎదిరి

డి.డిపో మేనేజరు, ఏ.పి.యస్.ఆర్.టి.సి., మంగళగిరి, గుంటూరు జిల్లా .. రెస్పాండెంట్

పై నెంబరు పిటీషనులో పిటీషనరు అయిన కొనికి ధనలక్ష్మి గారు సోదరుడు అయిన శృంగారపు శ్రీనివాసరావు మంగళగిరి ఆర్.టి.సిలో ఉద్యోగం చేస్తూ అనారోగ్యం వలన గుంటూరులోని ఒమేగా హాస్పిటల్ నందు ది.16.06.2023వ చనిపోయినాడు. అందువలన అతని తాలూకు రావలసిన డెత్ బెనిఫిట్స్ తీసుకునేందుకు అతని సోదరైన కొనికి ధనలక్ష్మి గారు అతనికి వారసురాలైనందున తను సక్సెషన్ సర్టిఫికెట్ ఇప్పించమని పై నెంబరు పిటీషన్ను పై కోర్టు నందు దాఖలు చేసియున్నారు. సదరు కొనికి ధనలక్ష్మికి సర్టిఫికెట్ ఇవ్వడంపై ఎవరికైనా ఏటి ఆక్షేపణలు ఉన్న యెడల ది.05-08-2024వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు మీరు స్వయంగా గానీ, మీ తరుపున న్యాయవాది ద్వారా గానీ హాజరు అయ్యి, మీ ఆక్షేపణలు తెలుపగలరు. లేని యెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుతో

వాయిదా : 05-08-2024

షేక్ కాలేష

న్యాయవాది, కొత్తపేట, తెనాలి.

ఫోన్: 9949448692

జనరల్ నోటీసు

IN THE COURT OF Addl SENIOR CIVIL JUDGE AT TENALI

IP NO.20/2024

Between

Emineni Hari Babu...Petitioner(Debtors)

and

1.Pallangi Nikesh Teja, R/o Gorlivanipelam, 2.Pedapati Vidya Sagar, R/o B.H.P.V. Ankireddy palem, 3.B.S.S.N Krishna, Parawada, 4.Ravipati Hanu mantha Rao, R/o Parawada, 5.Kotni Venkateswara Rao, R/o Thumpala Village, 6.Kona Nooki Naidu, R/o Butchyyapet, 7.Ane Hari Babu, R/o Anakapalli 8.Sarisa Ramesh @ Naresh, R/o Anakapalli, 9.Kanaka Appa Rao, R/o Anakapalli, 10.Peketi Nani Babu, R/o Ummalawada, 11.Pouri Naidu, R/o Ummalawada, 12.Singampalli Narasimha Murthy, R/o Parawada, 13.K.Hari Babu, R/o Anakapalli, 14.S.Varalakshmi, R/o Parawada, 15.Devudu, R/o Sirasapalli Village, 16.Satyannaarayana, R/o Nagulapalli Village, 17.G.Lakshman, Bayyavaram, 18.Koilada Sivaji, R/o Timmarayapet ... Respondents(Creditors)

పై నెంబరు డెటారు I.Pలో పిటీషనరు తనను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని దాఖలు చేసిన పిటీషనులో సదరుపై రెస్పాండెంట్లుతో పాటు యింకను ఎవరికైనా అభ్యంతరములు ఉన్నచో తెలుపుకోమని శ్రీ కోర్టు వారు జనరల్ నోటీసుకు ఆర్డరు వేస్తూ మీ హాజరు నిమిత్తం ది.18.07.2024వ తేదికి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం గం.10.30ని॥లకు స్వయంగా గాని మీ తరుపు న్యాయవాది ద్వారా గాని శ్రీ కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని యావన్మందికి తెలియజేయడమైనది. (శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో) వాయిదాతేది: 18-07-2024

కె. శ్రీనివాసరావు,

పిటీషనరు తరుపు న్యాయవాది, మంగళగిరి

సెల్: 97018 52089